సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

భారతీయ విద్యార్థులకు కెనడా సురక్షితం కాదు



పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద జన జాగరణ సమితి ఏర్పాటు చేసిన బ్యానర్

మర్రిపాలెం: భారతీయ విద్యార్థులకు కెనాడా దేశం సురక్షితం కాదని జన జాగరణ సమితి మర్రిపాలెం విశాఖ రీజనల్ పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ ఖలిస్తాన్ వేర్పాటు వాదానికి మద్దతుగా కొంతమంది సిక్కు విద్యార్థుల సమూహం భారతీయ విద్యార్థులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. కెనడా భారత్‌ల మధ్య ఏర్పడ్డ ఉద్రిక్తత వల్ల దేశ విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ మన విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ


మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులోని మర్రిపాలెం మస్జిద్ ఈ అల్ పతా, జాకీర్‌హుస్సేన్ నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో బుధవారం ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఖురాన్ పఠించి, శాంతి ర్యాలీ నిర్వహించారు. ముస్లిం మహిళలు, చిన్నారులు శుభాకాంక్షలు తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. చిన్నారులు నాతే కలములు ఆలపించగా ముస్లిం మత గురువులు తక్రీర్ పఠించారు. ప్రతి ఒక్కరిలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడవాలని మతగురువులు సూచించారు.

అనపర్తిలో జన్మభూమి ట్రైన్ హాల్ట్‌కు వినతి


ఎంపీ జీవీఎల్‌కు వినతిపత్రం అందిస్తున్న గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార: అనపర్తిలో జన్మభూమి ట్రైన్ హాల్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినిధులు మాట్లాడుతూ హాల్ట్ ఏర్పాటుతో అనపర్తి చుట్టుపక్కల ఏడు గ్రామాలకు చెందిన వందలాది గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రెవెన్యూ పరంగా రైల్వే శాఖకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ అంశంపై జీవీఎల్ సానుకూలంగా స్పందించి వెంటనే విజయవాడ రైల్వే జీఎంకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి విశాఖ రానున్నారని, ఆయనతో చర్చించి కృషి చేస్తానన్నారు. బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీంద్ర, అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వి.వి.సూర్రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పులగం సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్లపై నుంచి జారిపడిన వ్యక్తి మృతి

మర్రిపాలెం: అనారోగ్యంతో ప్రమాదవశాత్తు మెట్ల మీద నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న బోర జీవన్‌కుమార్(38) కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 25న ఇంట్లో మొదటి అంతస్తు నుంచి కిందకు దిగుతుండగా ఫిట్స్ రావడంతో ఒక్కసారిగా కిందకు పడిపోయాడు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. జీవన్‌కుమార్ సోదరుడు బోర ప్రశాంత్ ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

నేత్రపర్వంగా దుర్గాగణపతి ఊరేగింపు


నవదుర్గల నాట్యం


పల్లకీపై సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతిని ఊరేగిస్తున్న కె.కె.రాజు, సారిపల్లి గోవింద్ తదితరులు

సీతంపేట: సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి తిరువీధి మహోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. వినాయక నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత దుర్గాగణపతి ఉత్సవ మూర్తులను చూడ ముచ్చటగా అలంకరించి పల్లకీపై సీతంపేట పురవీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగించారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, ఆలయ ఈవో జి.వి.రమాభాయితో కలిసి ఉత్సవమూర్తికి తొలి పూజలు చేశారు. అనంతరం వారంతా పల్లకీ మోసి తిరువీధి మహోత్సవాన్ని ప్రారంభించారు. స్థానికులు, భక్తులు, యువత పల్లకీ మోసేందుకు పోటీపడ్డారు. సీతంపేట కూడలిలో ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు గురుద్వారా, గొల్లవీధి, గణేష్‌నగర్, కనకమ్మ ఆలయం, రాధాకృష్ణ మందిరం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి హారతులతో దుర్గాగణపతికి నీరాజనాలు అర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేరళ బ్యాండ్, తంబోలం బ్యాండ్, సాము గరిడీలు, కోలాటం, చెక్కభజనలు, తప్పెటగుళ్లు, నవదుర్గల డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు పల్లకీ వెంట నడిచారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ఊరేగింపులో కోలాటమాడుతున్న మహిళలు

సీఎం జగన్ నిర్ణయం చరిత్రాత్మకం

- కులాల ప్రాతిపదికన జనగణన ప్రకటనపై నాయకుల హర్షం


మాట్లాడుతున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

తాటిచెట్లపాలెం: కులాల ప్రాతిపదికన జనగణన చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మకమని రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. నరసింహనగర్‌లోని ఆమె కార్యాలయంలో బుధవారం నగరంలోని పలు నియోజకవర్గాల యాత ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ కుల ప్రాతిపదికన జనగణన జరగాలని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక ప్రజా సంఘాలు పోరాటాలు చేస్తున్నా.. ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ముందుంటుందని తెలిపేందుకు ఈ నిర్ణయమే సాక్ష్యమని పేర్కొన్నారు. కుల గణన జరిగినప్పుడు రిజర్వేషన్ల అమలు తీరు ఏ మేరకు ఉందన్న విషయం, విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలపై కూడా స్పష్టత వస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు మాట్లాడుతూ సమాజంలో రాజకీయ, ఆర్థిక, విద్య వంటి సదుపాయాలు పొందని అణగారని వర్గాలకు కులగణన ద్వారా నూటికి నూరు శాతం ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో ఆయా ప్రాంతాల యాత నాయకులు బసరమాని లక్ష్మణ రావు, గొడ్డి కన్నారావు, బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, వడిశెల సూరిబాబు, సిమ్మా గోవిందరావు, వనుం లోకేష్, పిల్లి సంతోష్‌కృష్ణ, పిల్లి కన్నారావు, పిల్లి రాజా రాఘవేంద్ర, లొట్ల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు

మురళీనగర్: రాష్ట్రంలో కుల గణనకు చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సీహెచ్ శ్రీనివాస్ గోపాలకృష్ణ శాసనసభలో ప్రకటించడంపై రాష్ట్ర భట్రాజులు కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ 49వ వార్డు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిర్ణయంతో దేశంలోనే కులగణన చేసిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు వస్తుందన్నారు. దీని వల్ల అన్ని సామాజిక వర్గ ప్రజలకు సామాజిక, రాజకీయంగా మేలు కలుగుతుందని ఆయన చెప్పారు.

దళితులకు రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు మురళి

సీతంపేట: దళితుల రక్షణ కోసం అనేక ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం నేడు నిర్వీర్యమైందని మాజీ మంత్రి కోండ్రు మురళీ అన్నారు. 41 నోటీస్ ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వడం వల్ల దళితులకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. మాల మహానాడు, దళిత సేన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఐక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను, ప్రశ్నించే గొంతుకను అణిచి వేస్తున్నారన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గతంలో అమలైన 28 పథకాలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళితలకు రక్షణ కల్పించి, సంక్షేమ పథకాలు పునరుద్ధించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పతివాడ రాంబాబు, బోనెల అప్పారావు, కె.జాన్, వై.బాలకృష్ణ, ఎస్.నాగమణి, బి.శ్రీనివాసరావు, కె.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఎఫ్ కృషి భేష్


వివరాలు వెల్లడిస్తున్న ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ రఘువీర్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో రైల్వే భద్రతా దళం 39వ ఆవిర్భావ దిన వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్ తెలిపారు. ఇందులో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో వారం రోజుల పాటు మొక్కలు నాటడం, ప్రయాణికులకు అవగాహన కల్పించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆర్పీఎఫ్ చేసిన కృషిని వివరించారు. రైల్వే ఆస్తుల పరిరక్షణ, ప్రయాణికుల భద్రతలో వారి పాత్రను తెలియజేశారు.

- మర్రిపాలెం యార్డ్‌లో సుమారు రూ.1.6 కోట్ల విలువైన కేబుల్స్ దొంగతనం జరగ్గా.. దొంగల ముఠాను అరెస్టు చేసి, రూ.1.5 కోట్ల కాపర్ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.
- బొగ్గు దొంగతనాలు, రైల్వే అనధికార టికెట్ ఏజెంట్లు, గంజాయి నిందితులను అదుపులోకి తీసుకుని గతేడాది కాలంలో 1.4 టన్నుల గంజాయిని సీజ్ చేశామన్నారు.
- ప్రయాణికులు పోగొట్టుకున్న, మరచిపోయిన సుమారు రూ.76 లక్షల విలువైన సామగ్రిని తిరిగి వారికి అప్పగించామన్నారు.
- ఇంటి నుంచి పారిపోయి, తప్పిపోయి వచ్చిన సుమారు 127 మంది పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమక్షంలో వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు తెలిపారు.
- కేకే లైన్‌లో తరచూ పట్టాలు తప్పే ఘటనలు జరిగేవని, 2022లో ప్రత్యేకంగా ముగ్గురు కమాండోలను దంతేవాడ పరిధిలో ఏర్పాటు చేయడంతో 2022, 2023 ఏడాదుల్లో అటువంటి ఘటనలు పునరావృతం కాలేదన్నారు.

రైల్వే ట్రాక్‌ల వద్ద జాగ్రత్త..

వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రతి ఏటా రైల్వే ట్రాక్‌ల పరిధిలో సుమారు 400 మంది ప్రాణాలు కోల్పోతున్నారని రఘువీర్ తెలిపారు. రైల్వే ట్రాక్‌లు దాటేటప్పుడు పాదచారులు వంతెనలు వినియోగించుకోవాలని సూచించారు. అవి లేని ప్రాంతాల్లో ఇరువైపులా గమనించి జాగ్రత్తగా ట్రాక్‌లు దాటాలని రైల్వే ట్రాక్‌ల పరిసరాల్లో నివసిస్తున్న వారికి విజ్ఞప్తి చేశారు.

ముగిసిన శ్రామిక్ కాంగ్రెస్ సర్వసభ్య సమావేశాలు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో మంగళవారం ప్రారంభమైన ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ద్వివార్షిక సర్వసభ్య సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు తీర్మానాలు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో 8 వేల నుంచి 9 వేల మంది ఉద్యోగుల కొరత ఉందని, వెంటనే వీటిని భర్తీ చేయాలన్నారు. రైల్వే జోన్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌ను వెంటనే తొలగించి కొత్తవి నిర్మించాలని తీర్మానించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వే మెన్స్ సహకారంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నిరంతరం ఉద్యోగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం పోరాడుతోందని తెలిపారు. అనంతరం రాబోయే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్ కుమార్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మహేశ్వరరావు, శ్రామిక్ కాంగ్రెస్ పరిధిలోని ఆయా బ్రాంచ్‌ల కేంద్ర కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు, ప్రతినిధులు, జనరల్ కౌన్సిల్ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు


వ్యాసరచన పోటీలో పాల్గొన్న ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు

సీతంపేట: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా బుధవారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎన్.వి.విశ్వనాథం, హెచ్ఎం లక్ష్మీనరస పర్యవేక్షించారు. ఎన్‌సీసీ క్యాడెట్ షేక్ హుస్సేన్ చాందిని వ్యాసరచనలో ప్రథమ బహుమతి, బి.సాయి వెంకటశ్రీ ద్వితీయ బహుమతిని, చిత్రలేఖనంలో ప్రథమ బహుమతిని బి.హరీష్‌కుమార్ సాధించారు. విజేతలను సుబేదార్ మేజర్ సజీవన్, 2(ఏ) ఆర్టిలరీ బ్యాటరీ ఎన్‌సీసీ విభాగాధిపతి కల్నల్ అజయ్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా వారు దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధుల గురించి వివరించారు.

వైభవంగా విజయ గణపతి నిమజ్జనం


నిమజ్జన కార్యక్రమంలో కె.కె.రాజు, కోలా గురువులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో ప్రతిష్టించిన విజయ గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామికి నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రి నిమజ్జన కార్యక్రమం వైభవంగా చేపట్టారు. యువకులు డ్యాన్స్‌లతో అదరగొట్టారు. కార్యక్రమంలో వీకేసీపీఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు, యువజన విభాగం అధ్యక్షుడు శివగణేష్, కిరణ్‌రాజు, నీలి రవి, రాజాం రాజు, అంబటి శైలేష్, అమర్‌నాథ్‌రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

గణపతి లడ్డు @ రూ.1.90 లక్షలు


వేలంలో దక్కించుకున్న లడ్డూతో సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు

విజయ గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి రెండు లడ్డూలను వేలం వేశారు. మొదటి లడ్డూను సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు రూ.లక్షా 90 వేలకు దక్కించుకున్నారు. రెండో లడ్డూను వైఎస్సార్‌సీపీ నాయకురాలు మాసిన లక్ష్మి రూ.30 వేలకు పాడుకున్నారు. వారికి లడ్డూలను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

వినాయక మండపాల్లో విశేష పూజలు


జైభారత్‌నగర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు


మురళీనగర్‌లో విజయ గణపతి

కంచరపాలెం: జీవీఎంసీ 48, 54 వార్డుల్లోని జైభారత్‌నగర్, మహాత్మాగాంధీ నగర్, ఇందిరానగర్-5, కంచరపాలెం శ్రీనగర్ ప్రాంతాల్లో బుధవారం భారీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. వీటిని ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. ఆయా మండపాల్లో వినాయకుడిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో 48వ వార్డు జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి నీలి రవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, రమణమ్మ, శ్రీను, హేమంత్, జగదీష్, నిఖిలేష్, ఉత్సవాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయ గణపతికి కరెన్సీ నోట్లతో అలంకరణ

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్-8లోని బాలభాను పాఠశాలలో కొలువైన విజయ గణపతికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులకు వెండిగిన్నెలను బహుమతిగా అందించారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీఎన్ రాజు, పాఠశాల కమిటీ సభ్యులు సీహెచ్ సత్తిబాబు, బీఆర్‌కే రాజు, ఎస్వీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎస్‌వీ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ రమణరావు పాల్గొన్నారు.

కృత్రిమ కొలనులో గణపతి నిమజ్జనం

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. అందరినీ ఆకట్టుకునేలా చిన్నారులు తయారు చేసిన కృత్రిమ కొలనులో గణపతి ప్రతిమను నిమజ్జనం చేశారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, సర్వసిద్ధి సాయిలత బహుమతులు అందజేశారు. కామిశెట్టి మనోహర్, నమ్మి జశ్వంత్, మానివ్రత, దుర్గాప్రసాద్, సిహెచ్.జశ్వంత్, కె.భానుతేజ, కుప్పా ఆశిశ్, రూపేశ్, కె.సురేష్, శ్రావ్య, నిఖిల, పిన్నింటి భరత్ తదితరులు పాల్గొన్నారు.


వరసిద్ధి వినాయక విగ్రహాన్ని కొలనులో నిమజ్జనం చేస్తున్న చిన్నారులు

వాడవాడలా అన్నదానాలు


అక్కయ్యపాలెంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ శ్రావణి


కళింగనగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


మధురానగర్‌లో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో మధురానగర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన మహా అన్నదానాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఒమ్మి రవికిరణ్, బండారు వెంకటేష్, సారిపిల్లి గంగరాజు, ముద్దాడ ఎల్లాజీరావు, మన్మథరావు, పిల్లారాజా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- 26వ వార్డు అక్కయ్యపాలెం చాకలిపేటలో సస్పెన్స్ బాయ్స్ ఆధ్వర్యంలో మహా అన్నదానం జరిగింది. కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

కళింగనగర్‌లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లో కళింగనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమణ, రమేష్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

కళా ఆస్పత్రి ఆవరణలో..

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు ద్వారకానగర్ ఐదో లేన్‌లోని కళా ఆస్పత్రి ఆవరణలో భారీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడుతూ వృత్తితోపాటు నేటి యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


అన్నప్రసాదం వడ్డిస్తున్న డాక్టర్ రమణమూర్తి

హెల్త్ టూరిజానికి విశాఖ అనువైనది


డాక్టర్ జాన్‌ను అభినందిస్తున్న వైద్యులు

సీతంపేట: విశాఖ నగరం హెల్త్ టూరిజానికి అన్నివిధాల అనువైన ప్రాంతమని డెంటల్ కాస్మెటిక్ నిపుణుడు డాక్టర్ జాన్ మాడుగుల అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం 'విశాఖలో హెల్త్ టూరిజం' అనే అంశంపై శంకరమఠం రోడ్డులోని వీ డెంటల్ హాస్పిటల్‌లో జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. అమెరికా, యూరప్ దేశాలలో పోల్చితే భారత్‌లో అందులో విశాఖలో వైద్య ఖర్చులు చాలా తక్కువని, ముఖ్యంగా దంత వైద్య ఖర్చుల్లో చాలా వ్యత్యాసం ఉందన్నారు. ముంబై, గోవా, హైదరాబాద్, కేరళల్లో ఇప్పటికే హెల్త్ టూరిజం ద్వారా ఆదాయం లభిస్తోందని చెప్పారు. టూరిజం ప్రతినిధుల సహకారంతో విశాఖలో హెల్త్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని, దీనికి సమగ్ర నివేదిక రూపొందించి పర్యాటక శాఖకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ పర్యాటక అవార్డు గ్రహీత రాజా రమేష్, వీ డెంటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, డెంటల్ ఇంప్లాంటాలజిస్టులు డాక్టర్ అనిత, వై.శ్వేత, సిహెచ్.పార్వతి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com